**ఓం నమో భగవతే శ్రీరమణాయ**

# రమణభాస్కర

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 19-12-01, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

తాడినాడలో ఎక్కువమంది మంత్రాలు ఇమ్మని అడుగుతున్నారు. గణపతిశాస్త్రిగారికి భగవాన్ ఏమిచెప్పారుఅంటే మంత్రంచేసేవారు మంత్రనాదం ఎక్కడనుండి వస్తోందోచూస్తే మనస్సు వెళ్ళి అక్కడ లయిస్తుందిఅని చెప్పారు అంటే మంత్రనాదం హృదయంలోనుండి వస్తోంది మనస్సు వెళ్ళి హృదయంలో లయిస్తుంది. మిమ్మల్ని మీరు హింసపెట్టుకోవద్దు, మిమ్మల్ని మీరు బాధపెట్టుకోవద్దుఅని గీతలో భగవంతుడు ఉపదేశించాడు. దేహమే నేను అనుకొనేవాడు వాడినివాడు హింసపెట్టుకొంటూఉంటాడు. ఆత్మేనేనుఅనుకొనేవాడు వాడినివాడు హింసపెట్టుకోడు. దీనిఅర్థంఏమిటిఅంటే ఆత్మజ్ఞానం కలిగేవరకూ, హృదయంలోఉన్న సత్యం అనుభవంలోనికి వచ్చేవరకు ప్రతీమానవుడు వాడినివాడు హింసపెట్టుకొంటూ ఉంటాడు. ఇక్కడ ఇంతమందిఉన్నారు. ఇందులో మిమ్మల్ని మీరు బాధపెట్టుకోకుండా ఉండేవారు ఎంతమంది ఉన్నారు? ఒక్కరుకూడాలేరు. అది ఒక్క జ్ఞానికే సాధ్యం. జ్ఞాని వాడినివాడు హింసపెట్టుకోడు ఎందుచేతనంటే వాడుఎవడోవాడికి తెలుసు. మీరు మీదేహంతో, మీమనస్సుతో ఎలా తాదాప్యం పొందుతున్నారో అలాగ జ్ఞాని చైతన్యంతోటి తాదాప్యం పొందుతూఉంటాడు కాబట్టి అక్కడ బాధలేదు. ఆత్మజ్ఞానం కలిగేవరకూ మానవుడు వాడిని వాడు హింసపెట్టుకొంటూనేఉంటాడు. అలా హింసపెట్టుకోవద్దని కృష్ణుడు గీతలో చాలాసార్లు చెప్పాడు. మంత్రాలుఅంటే ఇష్టపడుతున్నారు చేసుకోండి, మంచిదే. ఒకరూపాన్ని ధ్యానించటంవలన, ఒకనామాన్ని స్మరించటంవలన మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. కాని మనస్సు ఎప్పుడు నశిస్తుందిఅంటే దాని మూలాన్ని అది చూసినప్పుడు మనస్సునశిస్తుంది. ప్రాణాయామంవలనకూడా మనస్సుకు ఏకాగ్రతవస్తుందిగాని మనస్సు నశించదు. మనస్సు అణగటంవేరు, మనస్సునశించటంవేరు. చనిపోయిన పామువలన ప్రమాదంలేదుగాని అణిగిన పాము అది మరల ఎప్పుడో విజృంభించే ప్రమాదం ఉంది. అలాగే మృతమనస్సువలన ప్రమాదంలేదుగాని అణిగిన మనస్సు మరల విజృంభించే అవకాశం ఉంది. కొంతమంది ప్రకృతి ఆశ్రమాలకు వెళ్ళి కొన్నిరోజులు ఉపవాసాలు చేస్తారు. అప్పుడు మనస్సు అణిగిఉంటుంది. ఇంటికివచ్చి రెట్టింపు తినేస్తారు. మనోనిగ్రహంముఖ్యం. మనస్సును నియమించుకోమని భగవంతుడు చెప్పాడు ఆయన మనకోసమే చెప్పాడు. ఆహారం యుక్తంగాఉండాలి. నిల్వ





సరకులు తినకూడదు. శరీరానికి సరిపడ ఆహారం తీసుకోవాలి. స్నేహాలు యుక్తంగా ఉండాలి. అతిగా స్నేహంచేయటంవలన వర్తమానకాలాన్ని వదిలేస్తారు, భగవంతుడిని మర్చిపోతారు, కాలక్షేపం కబుర్లువేసుకొని కూర్చొంటారు. దానివలన ఎవరికి ఉపయోగంఉండదు, లోపల కుళ్ళిపోతారు. అందుచేత అతిగా స్నేహాలుచేయవద్దు. ఆహారం యుక్తంగాఉండాలి, మాటలు యుక్తంగా ఉండాలి, విహారం యుక్తంగా ఉండాలి. అన్నీ యుక్తంగా ఉండాలి ఎందులోను అతి పనికిరాదుఅని భగవంతుడు చెపుతున్నాడు. ఒకజ్ఞాని, ఒకఅజ్ఞాని ప్రక్కప్రక్కనే కూర్చోవచ్చు. శరీరాలు దగ్గరగానేఉంటాయి కాని లోపలకు వెళ్ళిచూస్తే ఒకరికి ఒకరికి సంబంధంలేదు. మన శరీరాల రంగులుతేడా, మనస్సులో గుణాలుతేడా కాని లోపల ఉన్న చైతన్యంమటుకు ఒకటిగానే ఉంది. అది అర్థమయ్యేవరకూ ఇతరులను హింసపెడతాము, మనలను మనం హింస పెట్టుకోకుండాఉండలేము.

ప్రపంచంలో మంచివారూ ఉంటారు, చెడ్డవారు ఉంటారు. మనం బాగుపడటానికి, మనం అభివృద్ధిలోనికి రావటానికి మంచివారు ఎంత అవసరమో, చెడ్డవారుకూడా అంతే అవసరం అయిఉండవచ్చు. అందువలన మంచివారికి వంద నమస్కారములుపెడితే, చెడ్డవారికి వెయ్యి నమస్కారములు పెడదాము. మంచివారికీ కృతజ్ఞత చెప్పాలి. చెడ్డవారికీ కృతజ్ఞతచెప్పాలి. జీవితంలో ఎటువంటి సంఘటనలు జరిగినా ఉద్రేకపడకూడదు. ఉద్రేకపడటంవలన మనం చెడిపోతాము మనలో మార్పుతెచ్చుకోవటంవలన మనం బాగుపడతాము. మారుమనస్సురావాలి. మారుమనస్సు రావడానికి మంచివారు ఉపయోగపడవచ్చు, చెడ్డవారుకూడా ఉపయోగపడవచ్చు. రాగద్వేషములు తగ్గించుకోమని భగవంతుడుచెప్పాడు. వాటిని తగ్గించుకోవటం ఎలాగ అని అడుగుతున్నారు. రాగద్వేషములు తగ్గించుకోవటం ఎలాగ అంటే ఈశ్వరుని నిరంతరం చింతించటంవలన, ఆత్మను నిరంతరం చింతించటంవలన రాగద్వేషములు తగ్గుతాయి. ఈశ్వరుని పాదాలను ఆశ్రయించటంవలన, ఆత్మజ్ఞానంగురించి నిరంతరం శ్రవణంచేయటంవలన, గురువులపట్ల ప్రేమ, గౌరవం కలిగిఉండటంవలన రాగద్వేషములు నెమ్మదిగా తగ్గుతాయి. గురువుఅంటే ఎవరో అనుకోవద్దు, దేవుడుఅంటే ఎవరో అనుకోవద్దు. మనలోపల ఉన్న ఆత్మే, మనలోపల ఉన్న సత్యమే మనకు గురువుగా, మనకు రాముడిగా, కృష్ణుడిగా కనిపిస్తోంది. అందుచేత మనలోపల ఉన్న సత్యాన్ని మనం అనుభవంలోనికి తెచ్చుకొనేవరకూ ఈ బంధంలోనుండి, జననమరణ ప్రవాహంలోనుండి విడుదల పొందలేము. ఏ వస్తువుకయితే చావులేదో ఆవస్తువు మనకు అనుభవంలోనికి వచ్చినప్పడే మనం చావులేనిస్థితిని పొందుతాము. చావుఅంటే అందరికీ భయం,

కంగారుపడిపోతారు. చావుఅంటే దేహంపోతుంది. దేహంపోతే మనకు వచ్చే నష్టంఏమిటి? ఆ విశ్లేషణ మనకు రావాలి. బండిఎద్దుకు మెడలో ఒకపూలదండ వేసాముఅనుకోండి. ఆ దండ దానిమెడలోఉన్నా, అక్కడనుండి ఊడిపోయినా ఆ ఎద్దు పట్టించుకోదు. అలాగే జ్ఞానికి కూడా వాడికి దేహంఉన్నా, దేహంపోయినా పట్టించుకోడు. మరణంవస్తే దేహంపోతుంది. అంతకంటే పోయేదిఏమిటి?

మీకు కాలం విలువ తెలియటంలేదుఅని భగవంతుడు గట్టిగా నొక్కినొక్కి చెప్పాడు. ఆయన ఏదైతే నొక్కినొక్కి చెప్పాడో అదే మనం వదిలివేస్తున్నాము. మీకు కాలంవిలువ తెలియటంలేదు. మీకాలాన్ని మీరు పాడుచేసుకొంటున్నారు. డబ్బుకంటే, గౌరవంకంటే అన్నింటికంటే కాలం అత్యంతవిలువైనది. శరీరానికి మరణంవచ్చేసింది అనుకోండి ఇంకో నాలుగురోజులు ఉంచు ధ్యానం చేసుకొంటానుఅంటే టైముఇవ్వడు, ఒకగంట ఆగమంటే ఆగడు. జేబులోఉన్న డబ్బుపోయిందిఅనుకోండి మరల ఎప్పుడైనా సంపాదించుకోవచ్చుగాని గడిచిపోయిన కాలం తిరిగిరాదు. అందుచేత కాలాన్ని పాడుచేసుకోవద్దు. మరణందగ్గరకు వచ్చేస్తోంది. మిమ్మల్ని మీరు బాగుచేసుకోండి. మిమ్మల్ని మీరు హింసపెట్టుకోవద్దు, మంచిస్నేహాలుచేయండి అని భగవంతుడు ఎన్నిసార్లుచెప్పినా మనం పట్టించుకోవటంలేదు. డబ్బుకుఇచ్చేవిలువ మనం కాలానికి ఇవ్వటంలేదు. వర్తమానకాలాన్ని ఉపయోగించుకోవటంలేదు. చేస్తే జపంచేయాలి, ధ్యానంచేయాలి లేకపోతే సత్పురుషుల సహవాసంచేయాలి, ఆత్మజ్ఞానంగురించి పెద్దలు చెపుతూఉంటే శ్రవణంచేయాలి. ఆత్మజ్ఞానం గురించి శ్రవణంచేయగా చేయగా దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలిఅనే బుద్ధి మనకు కలుగుతుంది లేకపోతే ఆబుద్ధి మనకు కలుగదు. చైతన్యం జన్మరహితం, మరణరహితం, అది నీవైఉన్నావు. అదిమనం అన్నసంగతి మనకు తెలియక శరీరానికి మరణంవస్తే కంగారుపడతాము. మీరు ఈపుణ్యంచేసుకోండి, ఈవ్రతంచేసుకోండి శరీరం మరణించాక మంచిలోకాలకు వెళతారుఅని ఇటువంటి మాటలు చెపుతారుగాని ఆత్మజ్ఞానం గురించి ఎవరూచెప్పరు. వారికే తెలియనప్పుడు వారు ఏమిచెపుతారు. మీరు పుణ్యాలుచేస్తే, వ్రతాలుచేస్తే మంచిలోకాలకు వెళ్ళవచ్చుగాని ఈదేహంతో తాదాప్యంపొందే నేను ఎంతనిజమో ఆలోకాలుకూడా అంతే నిజం. అసలు దేనిని తెలుసుకొంటే అజ్ఞానంనుండి విడుదలపొందుతాముఅని ముందు మనకు అవగాహన ఉండాలి. విద్యఅంటే ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహించటంవిద్య. చైతన్యాన్ని ఉన్నదిఉన్నట్లుగా గ్రహించటంవిద్య. ఆచైతన్యాన్ని దేహంఅనుకోవటం, మనస్సుఅనుకోవటం, మనస్సులోవచ్చే వికారములుఅనుకోవటం అవిద్య. చనిపోయే శరీరాన్ని ఆత్మఅనుకోవటం, చనిపోయేశరీరమే నేనుఅనుకోవటం అది అవిద్య. గురువు చేసేపని ఏమిటిఅంటే అవిద్యలోనుండి విద్యలోనికి తీసుకొనివస్తాడు. అంటే ఉన్నవస్తువును ఉన్నట్లుగా నీవుగ్రహించేటట్లు చేస్తాడు. వాడు గురువు. ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమయ్యేవరకు లేనిది ఉన్నట్లుగా నీకు అనిపిస్తుంది, అదేనిజంఅని అనుకొంటావు. మనం ఏమిచేయాలిఅంటే కాలాన్ని పాడుచేసుకోకూడదు, ఇంటిదగ్గర పనులు శ్రద్ధగా చేసుకొంటూ మంచిగ్రంథాలు అధ్యయనంచేయాలి. అధ్యయనం విషయంలో అశ్రద్ధ పనికిరాదు. మంచిమాటలు ఎవరైనాచెపుతూఉంటే శ్రవణంచేయాలి. వింటే సరిపోతుందా, ఆచరించవద్దాఅని కొంతమంది అంటారు. వినకుండా ఎలా ఆచరించగలము. వింటే ఎంతోకొంత ఆచరించవచ్చు. అప్పుడు ఆచరించలేనివి మనకు తెలుస్తూఉంటాయి. అయ్యోవాటిని మనం ఆచరించలేకపోతున్నాము, అవికూడా ఆచరించాలిఅని ప్రయత్నంచేస్తాము. వింటే సరిపోతుందాఅంటే విన్నా మనకు అర్ధంకాకపోతే, వినకపోతే ఇంక మనకు ఏమితెలుస్తుంది. గీతలో భగవంతుడు అనేకరకాలుగా చెప్పాడు. సాధనలో ఎవరు ఏస్థితిలోఉన్నా వారికి ఉపయోగపడే శ్లోకం ఎక్కడో ఒకచోట దొరుకుతుంది.

మీకు దుఃఖంవస్తూఉంటే, అశాంతివస్తూఉంటే మీరు ఏమిచేయాలి అంటే ఆ దుఃఖానికి కారణం తెలుసుకొని ఆ కారణం తీసివేయాలి. మీకు జ్వరంవచ్చిందిఅనుకోండి. ఆ జ్వరానికి కారణం ఏమిటో తెలుసుకొని దానిని తొలగిస్తే జ్వరంపోతుంది. అలాగే మీ దుఃఖానికి కారణం ఏమిటో తెలుసుకొని ఆ కారణాన్ని తొలగిస్తే దుఃఖంకూడాపోతుంది. ఈ లోకానికి అంతటికీ పరమాత్మ కారణంఅని చెపుతారు. ఆ పరమాత్మకు కారణం ఎవరు అనిఅడుగుతున్నారు. ఈ లోకానికి పరమాత్మకారణం. పరమాత్మకారణంలేనికారణం. ఎవడైతే జ్ఞానాన్ని సంపాదించాలిఅనుకొంటున్నాడో వాడు మనకు బయటశత్రువులు ఉన్నారు అనిఅనుకోడు. వాడికి ఉన్న కోరికే వాడికి శత్రువు, వాడి అజ్ఞానవే వాడికి శత్రువుఅనిఅనుకొంటాడు. ధనం సంపాదించటం కష్టమే. కష్టపడితేగాని ధనంకూడారాదు. కాని జ్ఞానం సంపాదించటం ఇంకా కష్టం. ఇక్కడ మనస్సును, ఇంద్రియాలను ఎప్పటికప్పడు నియమించుకోవాలి. అందుచేత ధనం సంపాదించటంకంటే జ్ఞానంసంపాదించటం ఇంకాకష్టం. లోపల ఉన్నవస్తువు శాంతిగాఉంది, ఆనందంగా ఉంది. మీరు అందరూ ఏమిచెయ్యాలిఅంటే మీమనస్సును చేదుగా ఉంచుకోవద్దు, పుల్లగాఉంచుకోవద్దు. మీమనస్సు పుల్లగాఉంటే, చేదుగాఉంటే ఆపుల్లదనం, చేదుతనం తీసేసి తీపిగా తయారుచేసుకోండి. మన మనస్సులో ఉన్నవికారములు తొలగించుకోవాలి. అదీ సాధనఅంటే. కంగారుపడవద్దు

మీకు అందరికీ జ్ఞానంకలుగుతుంది. రామకృష్ణుడు ఏసుఖాన్నిపొందాడో, రమణమహర్షి ఏసుఖాన్ని పొందాడో ఆసుఖం మిమ్మల్నికూడా వరిస్తుంది, ఇప్పడే ఈశరీరంఉండగానే వరిస్తుంది. తొందరపడవద్దు. మాటలవిషయంలో, ఆహారంవిషయంలో, నిద్రవిషయంలో బహుజాగ్రత్తగాఉండండి, అతి పనికిరాదు. కొద్దిసేపు ఏదైనా జపంచేసుకొంటాము అనుకోండి, మంచిదే దానివలన మనస్సు అణుగుతుంది. మరల వీథిలోనికి వచ్చి పదిమంది మధ్యలో కూర్చొంటాము అనుకోండి తాచుపాము బుసకొట్టినట్లు బుసకొడుతూఉంటుంది. తాత్కాలికం ఎప్పడూ తాత్కాలికమే. మనస్సు అణగటంకాదు మనస్సు నశించాలి. ఈ మనస్సు అనే సమస్యను పరిష్కరించుకోవాలి. కోపం ఒకవికారం, కోరికఒకవికారం. ఇవిఅన్నీ మనస్సులో ఉన్నాయి. ఈ వికారాలు రాకుండాచూసుకోవాలి. రైలుచక్రాలు పట్టాలమీద ఉంటే నిదానంగా వెళ్ళిపోతాయి అలాగే మన మనస్సులో వికారాలులేకుండా చూసుకొంటే మనచూపు నిదానంగాఉంటుంది, మాట నిదానంగాఉంటుంది, పని నిదానంగాఉంటుంది, వ్యవహారం నిదానంగా ఉంటుంది. లోకంఅంతా ఆనందంగా మనకు కనబడుతుంది. మన హృదయంలో తియ్యదనంఉంటే లోకంలో ఎక్కడచూసినా తియ్యదనం మనకు కనబడుతుంది. మనం ఎక్కడో మార్చుకోవటంకాదు, మనలోపలమార్పురావాలి. మనలనుచూసి ఎవరైనా బాగుపడితే బాగుపడతారు లేకపోయినా మనకు నష్టంలేదు. సంస్కర్తలుకావలెను, సంస్కర్తలుకావలెను. ఇతరులను సంస్కరించేవారుకాదు, వారిని వారు సంస్కరించుకొనేవారు కావాలి.అని రామ తీర్థస్వామిఅనేవారు. ముందు మిమ్మల్ని మీరు బాగుచేసుకోండి. మిమ్మల్ని చూసి ఇతరులు బాగుపడితే బాగుపడతారు లేకపోతేలేదు. మనం సుఖంగాఉన్నాముఅనుకోండి, శాంతిగాఉన్నాముఅనుకోండి మనకు దేహంఉన్నా నష్టంలేదు, దేహంపోయినా నష్టంలేదు.

అందరికీ శరీరాలు ఉన్నాయి. ఆ శరీరాలకు పేర్లుఉన్నాయి. ఫలానా శరీరంనాది, ఫలానాపేరునాదిఅని అనుకొన్నంత కాలం ఎవరికీ ఆత్మజ్ఞానంకలుగదు. పార్వతమ్మ మంచిదికాదు అన్నాము అనుకోండి. పార్వతమ్మకు దుఃఖంవచ్చేస్తుంది. ఎందుచేతనంటే ఆదేహంతో కలిసిఉంది, పార్వతి అనేపేరుతో కలిసిఉంది. ఆ శరీరంతో, ఆ పేరుతో కలవలేదు అనుకోండి పార్వతమ్మ మంచిదికాదుఅని అనకముందు ఎలాగుందో, మంచిదికాదు అన్నతరువాతకూడా అంత ప్రశాంతంగా, అంత సుఖంగాఉంటుంది. సబ్జక్టు అర్ధంచేసుకోండి. మీరు ఈ పూజచేసుకోండి స్వర్గలోకానికి వెళతారుఅని ఇటువంటి మాటలు చెప్పవలసిన పనిమాకులేదు. ఒకవేళ స్వర్గలోకానికి వెళ్ళినా తిరిగి ఈభూమిమీదకు రావలసిందే. సబ్జక్టు సరిగా అర్ధంచేసుకోండి, మన బ్రెయిన్‌కు పనిచెప్పండి. మీరు పూర్వజన్మలో మంచిపనులు





చేసిఉంటే, కోరికలేని కర్మ ఆచరించిఉంటే సత్పురుషులతో సహవాసంచేయాలిఅనే బుద్ధికలుగుతుందికాని లేకపోతే సత్పురుషులు నీ ప్రక్కనేఉన్నా సహవాసం చేయాలనేబుద్ధి నీకు కలుగదుఅని ఆచార్యులవారు చెప్పారు. మనం ఈదేహంతోను, ఈదేహానికిఉన్నపేరుతోను తాదాప్యం పొందుతున్నంతకాలం ఆత్మజ్ఞానం కలుగనేకలుగదు. లోపలఉన్న చైతన్యానికి ఈదేహానికి ఇసుమంతయు సంబంధంలేదు. అన్ని దేహాలు మట్టిలోనికే వెళ్ళిపోతాయి. మేము చనిపోయినతరువాత ఏమౌతాముఅని అందరూ అడుగుతున్నారు. చనిపోయిన తరువాత ఏమౌతాము అని అడిగేమీరు మరి పుట్టకముందు ఎక్కడఉన్నాము అని ప్రశ్న ఎందుకువేసుకోరు. మీకు చావుఅంటే ఇష్టంఉండటంలేదు ఎందుచేతనంటే చావులేని వస్తువు మీరై ఉన్నారు కాబట్టి మీకు చావుఅంటేఇష్టం ఉండటంలేదు. మీకు ఈచావు గొడవఎందుకు? పుట్టుక గొడవ ఎందుకు? ఇప్పడు నీవు ఎవరోనీకుతెలుసా? నీవు ఎవరో నీవు తెలుసుకోవటంమానివేసి, చేతిలోఉన్నకాలాన్ని వదిలేసి చనిపోయినతరువాత ఏమౌతాము గొడవనీకుఎందుకు? ఇప్పడు నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నంచెయ్యి.

మనం నేను, నేను అంటున్నాము. ఆనేనుఅనేదిఒకతలంపు, అదే ప్రథమతలంపు. ఆతలంపుదేహంతో తాదాప్యం పొందుతోంది. దానినే అహంభావనఅంటారు. అన్ని చిక్కులూ, అన్నికష్టాలూ నష్టాలూ అహంభావనలోనే ఉన్నాయి. కష్టపడి, కష్టపడి ఆగెడప దాటావో శాంతేశాంతి, ఆనందమేఆనందం, సుఖమేసుఖం ఎటుచూసినా ఆనందమే. దానికోసమే ఈబోధలు, ఈసత్సంగాలు. మీరు పూజచేయండి, జపంచేయండి, ధ్యానంచేయండి, ఏదోరకమైన సాధనలు మీపద్ధతిలో మీరుచేసుకోండి. కాని ఈ గెడపదాటండి అది ముఖ్యం.

మనవి బానిసత్వపు బ్రతుకులు. ఇప్పడు ఇక్కడ మీరు ఆనందంగా ఉన్నారు ఇంటికి వెళ్ళిన తరువాత మీభర్త ఎందుకు ఇంత ఆలస్యంగావచ్చావుఅంటే మీఆనందంఅంతాపోతుంది, మీ మొఖంలో వికారంవచ్చేస్తుంది. ఇది బానిసత్వం కాకపోతే ఏమిటి? ఈ జన్మలోనేకాదు, రాబోయే జన్మలో అయినాసరే మన సుఖంకోసం, శాంతికోసం ఇతరులమీద ఆధారపడినంతకాలం మనకు భానిసత్వంతప్పదు. మీకు, నాకు స్నేహంఅనుకోండి. ఇవాళ స్నేహం రేపు విరోధంగా మారవచ్చు. నా సుఖంకోసం మీమీద ఆధారపడ్డానుఅనుకోండి. మీరు విరోధులు అవుతారుఅనుకోండి. అప్పడు నాసుఖం అంతా దుఃఖంగా మారిపోతుంది. ఎందుకు ఇటువంటి భానిసత్వపుబ్రతుకులు? ఇలా ఎంతకాలం బ్రతుకుతాము. మీ తోడుకోడలకు మీమీద కోపంవస్తే మీసుఖంఅంతా, శాంతిఅంతా పోతూఉంటే ఈ సబ్జక్టు

శ్రవణంచేయటంఎందుకు? భగవద్గీత చదవటం ఎందుకు? మన సుఖంకోసం, శాంతికోసం ఇతరులమీద ఆధారపడినంతకాలం మనకు పునర్జన్మలు వస్తాయి, జననమరణచక్రంలో తిరుగుతూఉంటాము, ఇందులోనుండి ఎవరూ విడుదలచేయలేరు. మన సుఖం కోసం ఏ వస్తువు మీద ఆధారపడినా ప్రమాదమే. మనం ఉండగా ఆవస్తువుపోయిందిఅనుకోండి మరల మనకు దుఃఖంవచ్చేస్తుంది. మనసుఖంకోసం ఎవరిమీద ఆధారపడినా ప్రమాదమే. అది ఒకరకమైన భానిసజీవితం. కొంతసేపు ఏకాంతంగాఉండండిఅంటే చాలామంది ఉండలేరు. అన్నంతిని చెయ్యికడుక్కొంటారు రోడ్డుమీదకు వచ్చిపడిపోతారు, లేకపోతే ప్రక్కఇంటికి వెళ్ళిపోతారు. వీరి బుర్రలు అంతకుముందే పాడైపోయిఉంటాయి. వెళ్ళివారి బుర్రలుకూడా పాడుచేస్తారు. ఎందుకువచ్చిన జీవితాలుఇవి? అసలు సృష్టిలోఏమీలేదు, ఏదోఉందిఅని అనుకొంటున్నాము. దృశ్యజగత్తుఅంతాస్వప్నం. మనమనస్సులో మంచిఉంటే మంచిమాటలు వినాలిఅనిపిస్తుంది. మన మనస్సులో చెడ్డఉంటే చెడ్డమాటలు వినాలిఅనిపిస్తుంది. దానినిబట్టి మనమనస్సు ఎటువంటిదో మనకే తెలుస్తూఉంటుంది. మీమనస్సును మీరుబాగుచేసుకోండి, మనస్సును స్వాధీనంచేసుకోండి. మీ మనస్సు స్వాధీనంలోఉంటే దేశంఅంతా మీకు విరోధంగాఉన్నా దానివలన మీకువచ్చే నష్టంఏమీలేదు. మీ మనస్సు స్వాధీనంలోలేకపోతే మీఇంటిలో అందరూ మిమ్మల్ని సుఖపెట్టాలన్నా సుఖపెట్టలేరు. నీవు ఎవరోనీవుతెలుసుకో. నీవు ఈదేహం అనుకొంటున్నావు. నీవుదేహంకాదు. నీకు ఎన్నో వికారాలు వస్తున్నాయి, ఆవికారాలు నీవుకాదు. అహంకారంలో వికారాలు ఉన్నాయిగాని ఆత్మలో వికారాలులేవు. అందువలన నీవు ఏదైతేకాదో అందులోనుండి ఇదికాదు, ఇదికాదుఅని విడదీసుకొని నీవు ఎవరోనీవు తెలుసుకోవటానికి ప్రయత్నంచెయ్యి. అదేసాధన.

మనం అజ్ఞానంతో స్నేహంచేస్తున్నాము, జ్ఞానంకావాలిఅంటున్నాము. జ్ఞానంతో విరోధంగా ఉన్నప్పడు నీకుజ్ఞానం ఎలాకలుగుతుంది. ఎవరితో స్నేహంచేస్తే దుఃఖంవస్తుందో వారితో స్నేహంచేయటం, నాకు సుఖంకావాలిఅనుకోవటం. నిప్పమీద చెయ్యివెయ్యటం, చల్లగాఉంటే బాగుండునుఅనుకోవటం. నిప్పమీద చెయ్యివేసి చల్లగాఉంటే బాగుండునుఅనుకొంటే అర్ధంఏమిటి? అజ్ఞానంతో స్నేహంచేస్తూ నాకుజ్ఞానంకావాలిఅంటే జ్ఞానం ఎలావస్తుంది. ఎందుకు వచ్చినది ఇదిఅంతా. ఈ మాత్రం చిన్నవిషయాలు గ్రహించకపోతే ఎలాగ? అందువలన మీరు జ్ఞానంతో సహవాసం చెయ్యాలి. అవకాశం ఉన్నప్పడు మంచిచేయాలి. కాలేజీచదువులవలన జ్ఞానంవస్తుందిఅనుకోవద్దు, ఆ చదువులుఅన్నీ పొట్టకోసమే. చదువవలెను, చదువవలెను చావులేని చదువుచదువవలెను.

05-01-2002



అది ఆత్మవిద్య. ఈలోకంలో చాలావిద్యలు ఉన్నాయి కాని ఆత్మవిద్యనునేనుఅని భగవంతుడుచెప్పాడు. ఎవడైతే తన సుఖంకోసం, శాంతికోసం తనమీదే ఆధారపడిఉంటున్నాడో, ఆత్మలోనుండి సుఖాన్ని శాంతిని పొందుతున్నాడో వాడు మాత్రమే స్వతంత్రుడు, మిగిలినవారు అందరూ అస్వతంత్రులు, బానిసలు, కూలివారు. ప్రతీదానికి కారణంవెతకాలి. మనం ఎందుకు ఇలా అజ్ఞానంలోపడ్డాముఅని కారణం తెలుసుకొని ఆకారణాన్ని తొలగిస్తే అజ్ఞానంపోతుంది. ఆకారణం ఏమిటిఅంటే నీవుఏదైతేకాదో అది నీవు అనుకోవటం, ఏదైతే నీవుఅవునో అదినీకు తెలియకపోవటం. ఆ ముడి విడేవరకూ నిన్ను అశాంతి వెంబడిస్తుంది. మనస్సుఅంటే కొన్నితలంపుల సమూహము. ఈదేహంలో రక్తం, మాంసం, ఎముకలు ఉంటాయి. మనస్సును సూక్ష్మదేహంఅంటారు. ఆదేహంలో తలంపులు, కోరికలుఅన్నీ ఉంటాయి. రెండూదేహాలే. ఈ దేహం చనిపోతే ఆదేహంఇంకో స్థూలదేహాన్ని తొడుక్కొంటుంది. సూక్ష్మదేహంలోఉన్నది స్థూలదేహంలో కనిపిస్తూఉంటుంది. మీకు కోపంవచ్చిందిఅనుకోండి ఆకోపం ఎవరికి తెలియటంలేదు అనుకొంటారుకాని మీమాటనుచూస్తే, మీకళ్ళుచూస్తే అది తెలుస్తూనేఉంటుంది. నన్ను చూసి మీరు అసూయపడుతున్నారుఅనుకోండి. అసూయ నాకు తెలుస్తూనేఉంటుందిగాని నేను అసూయను గుర్తించకూడదు. గుర్తిస్తే అదినాఅజ్ఞానం. అటు ఎందుకుచూడాలి? చైతన్యంవంకేచూడు. అసూయఅనేది మీలోఉన్నఒకవికారం. అటుచూస్తే కొంతకాలానికి నాకుకూడా అసూయవచ్చేస్తుంది. ఇదిబాగా అర్ధంచేసుకోండి. మీలోఉన్న వికారాన్ని చూసేబదులు మీలోఉన్న మంచినిచూస్తే సరిపోతుందికదా. మీలోఉన్న మంచినిచూస్తే నాలోఉన్న మంచి పెరుగుతుంది. మీలోఉన్న వికారాన్ని చూడటంవలన కొంతకాలానికి నాకుకూడా ఆవికారంవచ్చేస్తుంది. ఎవడైనా నీకు చెడ్డచేస్తే నీవుమంచినిఇయ్యి. చెడ్డచేస్తే చెడ్డఇవ్వకు, తిరిగిమంచినిఇయ్యి. ఎవడైనా నీకు అశాంతిని కలుగజేస్తున్నాడుఅనుకో వాడికి అశాంతినిఇవ్వకు, తిరిగి శాంతినిఇయ్యి. ఎవడైనా నిన్నుచూసి అసూయపడుతున్నాడు అనుకో తిరిగి వాడిని చూసి నీవు అసూయ పడితే లోకంలో అందరితోను సమానమైపోతావు. నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. నిన్ను చూసి ఎవడైనా అసూయపడుతున్నాడు అనుకో నీవుతిరిగి అసూయను ఇచ్చేబదులు, ప్రేమనుఇయ్యి. వాడు బాగుపడతాడు, బాగుపడడుఅనేది నీకుఅనవసరం, నీచైతన్యస్థాయిపెరుగుతుంది, నీకు ఆత్మజ్ఞానంకలుగుతుంది. మనకోసమే ఇదిఅంతా భగవంతుడుచెపుతున్నాడు. నీవు నన్ను ఆరాధించటంకాదు, మారుమనస్సునుపొందు. నీవు మారుమనస్సును పొందవుఅనుకో నన్ను పూజించినా

నీకుసుఖంఏమిటి? నాకుసుఖంఏమిటి? అంటున్నాడు. రాముడిని స్మరించి, స్మరించి లోపల మారుమనస్సునుపొందాలిగాని రాముడి పఠం పెట్టుకొని అక్కడ పుష్పాలు పెడితే సరిపోదు. మన మనస్సులో మార్పురావాలిగాని ఏదోపూజతో సరిపెట్టుకొంటే దానివలన పెద్ద ప్రయోజనం ఏమీఉండదు. దానివలన పుణ్యంవస్తేరావచ్చు అది అనుభవిస్తేపోతుంది. ఇవిఅన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. ఇవిఅన్నీ తాత్కాలికవిషయములు. మీలోఉన్న వికారములనుచూసేబదులు మీలోఉన్న చైతన్యాన్నిచూస్తే నాలో చైతన్యస్థాయి పెరుగుతుంది. అందువలన అటుచూడటం మానివేసి ఇటుచూస్తే సరిపోతుంది.

మనలోపల ప్రభువుఉన్నాడు. వాడు మనలను సుఖపెట్టాలిఅని చూస్తున్నాడు. కాని అహంకారంఅడ్డుగావస్తోంది. మీరు నాకు ఉపకారంచేద్దాముఅనుకొన్నారుఅనుకోండి. ఒకోసారి ఇతరులువచ్చి వాడికి ఉపకారంచేయటంఎందుకుఅని అడ్డుపడతారు అలాగే అహంకారం నాకు అడ్డుగావస్తోంది. ఎందుచేతనంటే లోపలఉన్న ప్రభువు నాకు అనుభవంలోనికి వస్తే దానికి ఉండటానికి నీడఉండదు, అది నశిస్తుంది. లోపల ఉన్నవస్తువుకు మనమీద దయకలిగి ఎప్పడో విజృంభిస్తే అదిపోవాలిగాని లేకపోతే ఈ అహంకారంపోదు. అహంకారమే మనం అనుకొంటున్నాము అందువలన దానిని తొలగించుకోవటానికి ప్రయత్నంచేయటంలేదు. లోపల ఉన్నవస్తువుకు మనమీద అనుగ్రహంకలిగి దానిని తీసిపాడేసి అది మనకు తెలియబడాలిగాని లేకపోతే మన తెలివితేటలవలన అహంకారం నుండి బయటపడలేము. కొంతమందికి మాటలో, ఆలోచనలో స్పష్టతఉండదు. ఆలోచనలో స్పష్టతఉంటే మాటలోస్పష్టతవస్తుంది. నేనుఏమిచెపుతున్నానో నాకేతెలియకపోతే వినేవాడికి ఏమితెలుస్తుంది. నాకే కుదురులేనప్పడు మీఅందరికి నేనుకుదురు ఎలా తీసుకురాగలను. నాకేశాంతిలేనప్పడు మీకుశాంతిని ఎలాఇవ్వగలను. మాట, మనస్సు అణగాలి. అజ్ఞానంతో మాట్లాడకూడదు. మనస్సును ఎక్కువగా వాడకూడదు, వాడేకొలది మనస్సు పెరిగిపోతుంది. చేతనయితే ఇతరులకు ఎంతోకొంత సహకరించాలి. చేతకాకపోతే కామ్‌గాఉండాలి. మనం ఉపయోగపడే పనులు చేయము. ఉపయోగపడే పనులు మనకు చేతకాకపోతే కామ్‌గాఉంటే సరిపోతుంది. మనం కామ్‌గా ఉండకుండా, ఉపయోగపడే పనులు మనకు చేతకాదుకాబట్టి ఉపయోగంలేని పనులుచేస్తూఉంటాము. మీకు చేతనైతే ఎవరికైనా ఇల్లుకట్టిపెట్టండి. లేకపోతే నాకు ఇల్లుకట్టటం చేతకాదుఅని ఊరుకోండి అంతేగాని ఇంకొకడి ఇల్లుపడగొట్టటం ఎందుకు. దానివలన అజ్ఞానంలోకూరుకొనిపోతాము. బ్రతికిఉండగా చీకటి, శరీరం మరణించాక భగవంతుడు చీకటిలోకాలకు తీసుకొనిపోతాడు. ఈశ్వరుడు సర్వసాక్షి, మనకు





ఏతలంపులువస్తున్నామో లోపల ఉండి ఈశ్వరుడుచూస్తూఉంటాడు. మనంఅంటే ఇష్టంలేనివారు మనలనుతిడుతున్నారుఅనుకోండి. మీరు ఉద్రేకపడిపోతారు. మనంఅంటే వారికి ఇష్టంలేదు అందువలన తిడుతున్నారు. అది సహజంఅనుకొంటే ఏమీలేదు మీమనస్సు శాంతిపడిపోతుంది.

దేహం పుట్టినప్పడు నేనుపుట్టానుఅనుకొంటున్నావు. దేహంచనిపోయినప్పడు నేనుచనిపోతున్నానుఅనుకొంటున్నావు. దేహమే నువ్వుఅయితే దేహంపుట్టినప్పడు నీవుపుట్టినమాటనిజమే, దేహంచనిపోయినప్పడు నీవు చనిపోవటంమాటనిజమే కాని నీవుదేహంకాదు. నీవుఏదిగాఉన్నావో అదినీకు తెలియటంలేదు, దానిని దేహంఅనుకొంటున్నావు. అందుచేత దేహంచనిపోయినప్పడు నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు కాని నీవుచనిపోవటంలేదు. చనిపోతున్నానుఅనుకోవటంకూడా ఒకతలంపే. పుట్టుక ఒకతలంపు, మరణంఒకతలంపు, ముసలితనంఒకతలంపు, స్నేహంఒకతలంపు, విరోధంఒకతలంపు. అన్నీతలంపులే. దేవుడు ఉన్నాడుఅని చెప్పటంఒకతలంపు. దేవుడులేడుఅనిచెప్పటంఒకతలంపు. కాని తలంపులులేనివస్తువుఒకటిఉంది. అదేసద్వస్తువు. అదేపరమసత్యం. దానికి తలంపులులేవు. అక్కడికి చేరుకొనేవరకు ఏదోఒకతలంపు, ఏదోఒకకోరిక నిన్ను వెంటాడుతూఉంటాయి ఈజన్మలోనేకాదు రాబోయేజన్మలోకూడా.

నీకు కోరికవస్తోంది. కోరికకు భంగంవస్తేకోపంవస్తోంది. కోపం తరువాత భయం వస్తోంది. ఇవిఅన్నీ నెత్తిమీదపెట్టుకొని నీవు ఎలా సుఖపడతావుఅని పరమాత్మఅంటున్నాడు. మనతల్లితండ్రులు మనకోసం చాలాకష్టపడి సంపాదించి మనకు చదువులుచెప్పించారు, మన మలమూత్రాలు ఎత్తారు, మనం ఈరోజుఇలా ఉండటానికి వారు ఎన్నో త్యాగాలుచేసారు, వారి సంతోషాలు, సుఖాలు ఎన్నో మనకోసం వదులుకొన్నారు అవిఅన్నీ మర్చిపోయి ఈ ముసలివాడు ఎప్పడు చనిపోతాడు, గది ఎప్పడు ఖాళీఅవుతుందిఅని చూస్తున్నారు. కొంతమంది తల్లులు ఉంటారు వారిఇష్టాన్ని ప్రక్కనపెట్టి పిల్లలకు ఇష్టమైనదేచేసి అదే వారుకూడాతింటారు. తెల్లవారుజామున 4 గం॥లకు లెగుస్తారు, పిల్లల చదువుకోసం వారు మెలుకువగా ఉంటారు. ఇలాకష్టపడితే ఇదిఅంతా మర్చిపోయి ఎప్పడు చనిపోతుందిఅని చూసేవారు చాలామందిఉన్నారు. ఇది కాలక్షేపంకోసం చెప్పటంలేదు. జనరల్‌గా మానవస్వభావంలో కృతజ్ఞతఅనేది తక్కువగా ఉంటుంది. అందరి గొడవ మనకు అనవసరం మనంమటుకు మంచివారిపట్ల ఎలా కృతజ్ఞతతో ఉంటామో చెడ్డవారిపట్లకూడా అలా కృతజ్ఞతతో ఉందాము. ఇష్టులపట్ల, అయిష్టులపట్ల మనం కృతజ్ఞత చూపిందాము. ఎందుచేతనంటే

మన చైతన్యస్థాయి పెంచుకోవటంకోసం, మనలను మనం సంస్కరించుకోవటంకోసం, ఆత్మజ్ఞానం పొందటంకోసం, దేహబుద్ధి తగ్గటంకోసం మనలను మనం అణచుకొందాం, వినయం సంపాదించుకొందాం. అణిగిన మనస్సుకు అత్మశాంతి తెలుస్తుందిగాని విజృంభించే మనస్సుకు ఆత్మశాంతి అందదు. శాంతి ఆకాశంలోలేదు, నీహృదయంలోఉంది. అందువలన ఓ అరుణాచలేశ్వరుడా! నాకు లోచూపునేర్పు. లోచూపుకలిగితే లోపలఏమిఉందో నాకుతెలుస్తుంది. నాకు లోచూపులేదుఅనుకో లోచూపు నేర్పి లోపలఉన్నసద్వస్తువును గ్రహించేటట్లు చూడవయ్యా అన్నారు భగవాన్.

దేహమేఆత్మఅని అనుకొంటున్నావు. దేహానికి లోపలఉన్న ఆత్మకు ఇసుమంతయు సంబంధంలేదు. నీవుఆత్మవేకాని నేనుదేహాన్నిఅని ఎందుకుఅనుకొంటున్నావుఅంటే మూలతలంపు అలాఅనిపింపజేస్తోంది. దానిని తీసి ఒకప్రక్కనపెట్టు. ఆ మూలతలంపు వలననే నీకు అశాంతివస్తోంది, దుఃఖంవస్తోంది. లోపలఉన్నచైతన్యానికి దేహంఅక్కరలేదు. మూలతలంపుకే దేహంకావాలి. అందువలన ఈ శరీరం మరణిస్తే ఇంకోకొత్తదేహం ధరిస్తుంది. ఈ మూలతలంపునుండి విడుదలపొందటమే మోక్షం. దేహంఉండగానే దేహము నేనుఅనేతలంపునుండి ఎప్పుడైతే విడుదలపొందావో అప్పుడు ఉన్నవస్తువుఉన్నట్లుగా నీకువ్యక్తమవుతుంది. మనం ఈ మూలతలంపునుండి విడుదలపొందాలి అదే సాధనయొక్క ప్రయోజనం. ఉన్నదేదోఉంది, లేనిదేదోలేదు. ఉన్నదానిని లేదులేదు అనుకొన్నప్పుడుకూడా అది లేకుండాపోదు. లేనిదిఉందిఉంది అనుకొన్నప్పుడుకూడా దానికి ఉండటం అంటూలేదు. ఇది నిశ్చయంఅని భగవంతుడు చెప్పాడు. మీకు మంచితలంపులు వస్తున్నాయిఅనుకోండి. మీదగ్గర కూర్చొంటే ఆమంచితలంపులయొక్క ప్రభావం మామీదకూడా పడుతుంది. ఓ ఈశ్వరుడా! ఏమూలనుండివచ్చినా, ఏదిక్కునుండివచ్చినా ఎటునుండి ఎలావచ్చినా నాకు మంచితలంపులు, నేను బాగుపడేతలంపులు, నామనస్సుకు అంతర్దృష్టిని కలుగజేసే తలంపులు వచ్చేటట్టు నన్ను ఆశీర్వదించు తండ్రీ అని ఋగ్వేదంలోఉంది. ఎందుచేతనంటే మంచితలంపులవస్తే మంచిమాట్లాడతాము. తలంపునుబట్టి మాట్లాడతాము, తలంపునుబట్టిపనిచేస్తాము. మంచిచెడ్డా మనస్సులోనే ఉన్నాయి. కాని మంచిని ఎందుకు పెంచుకోమన్నారుఅంటే మంచి మనకు ఆత్మజ్ఞానం పొందటానికి సహకరిస్తుంది. మంచి ఏరూపంలోఉన్నా దానినిప్రేమించు. మంచినిప్రేమించేశక్తి లేనివాడికి ఆత్మజ్ఞానం ఏమిటి? ఎక్కడయినామంచిఉంటే చూసి సంతోషించేవారు ఎంతమందిఉన్నారు. మీరు మంచితనంగా ఉండటానికి ప్రయత్నంచేస్తూఉంటే, మీరు నిజంగా జిజ్ఞాసువులుఅయితే,





ఆత్మజ్ఞానంకోసం ప్రయత్నంచేస్తూఉంటే ముందు మీఇంటిలోనివారే శత్రువులుఅవుతారు. మీఇంటిలోనివారికే ముందు అసూయప్రారంభమవుతుంది. అప్పుడు మీరు కంగారుపడిపోవద్దు. అది సహజంఅనుకొని మీపనిఏదో మీరుచేసుకోండి. అది సహజంకాదు అది అసహజంఅనుకొంటే మీకుఉద్రేకంవచ్చేస్తుంది. మనస్సులో బేధంఉంది మనం మనస్సుగా ఉన్నంతకాలం భేదంలేకుండా ఉండలేము. మనస్సు నశిస్తే బేధం నశిస్తుంది. అప్పుడు ఒకటిగా ఉండగలము. నేను వేరు, లోకంవేరు, దేవుడువేరు అని అనుకొంటున్నాను. అది నా అజ్ఞానానికి గుర్తు. మనందరము లోపలఒకటిగానే ఉన్నాము. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొని కాలంపాడుచేసుకోవద్దు. భవిష్యత్‌లో గాలిమేడలు కట్టవద్దు. ఎప్పుడు ఏది ఎలాజరగాలో అది జరుగుతూ ఉంటుంది. అందువలన వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని నీవు ఎవడో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నంచెయ్యి. దేవుడు ఉన్నాడుఅని చెప్పటం ఒకతలంపు. దేవుడులేడుఅని చెప్పటం ఒకతలంపు. దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడికి దేవుడి గురించి తెలియదు. దేవుడులేడు అని చెప్పేవాడికి దేవుడు గురించి తెలియదు. దేవుడి గొడవ వదిలెయ్యి. నువ్వుఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోందికదా. నీవు ఎవడో నీకు తెలిస్తే దేవుడు ఎవడో నీకు తెలుస్తాడు. రమణమహర్షి ఎవరిలోను మార్పు తీసుకొని రాలేకపోయాడుఅని ఎవరో నాదగ్గరఅన్నారు. ఎవరిగొడవో నీకుఎందుకు. మీరుచదువుకొని, అర్థంచేసుకొని, మీరు మారటానికి ప్రయత్నంచేయండి అనిచెప్పాను. నేను ఉంటే నీవు ఉన్నావు. నీవుఉంటేవాడు ఉన్నాడు. ఎవరో గొడవ నీకు ఎందుకు? రమణమహర్షి ఎవరిలోను మార్పు తీసుకొని రాలేదుఅని చెప్పేబదులు మీరు మారవచ్చుకదా. నువ్వు ఎప్పుడూ ఉన్నావు. కాని ఇప్పుడు ఉన్నది నీ సహజస్థితికాదు. అది అసహజస్థితి. అందువలననే నీకు దుఃఖం వస్తోంది. నీవు సహజస్థితిలో ఉంటే నీకు దు:ఖం రాదు. నీవు ఏదైతే అవునో దానితో నీకు తాదాప్యం ఉంటే నీకు దు:ఖం రాదు. నీవు కానిదానితో తాదాప్యం పొందుతున్నావు కాబట్టి నీకు దు:ఖం వస్తోంది. దేహమే నువ్వు అనుకొంటున్నావు. ఏదేహంవస్తే ఆదేహంతో, ఆదేహానికి పెట్టినపేరుతో తాదాప్యం పొందుతున్నావు. అదే బంధం. ఆ రెండింటిలోనుండి విడుదలపొందితే శాంతి. మనం సాధనచేసి మనలోపలఉన్న అహంభావనను తగ్గించుకొంటే మనం బాగా ముగ్గుతాము. అంటే అహంభావన తగ్గేకొలది మన చైతన్యస్థాయి పెరుగుతుంది. అహంభావన పెరుగుతూఉంటే మనకు నీచమైన ఆలోచనలువస్తాయి. అహంభావన తగ్గేకొలది మనకు ఉదాత్తమైన ఆలోచనలు వస్తాయి. అహంభావనను తగ్గించుకొంటావా, దానిని పెంచుకొంటావా అది నీ చేతులలోఉంది. మనం

ఎప్పుడూ ఉన్నాము. పుట్టకముందు ఉన్నాము, ఇప్పుడూఉన్నాము, ఈదేహం చనిపోయినతరువాతకూడా ఉంటాము. మనం ఎప్పుడూ ఉంటాముఅని మనకు అవగాహన కావటంలేదు. మనోనాశనం అయితేగాని ఇది మనకు అనుభవంలోనికిరాదు. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అదినిజంకాదు. అది ఒక తలంపు. ఆతలంపుకు ఇతర తలంపులు వస్తున్నాయి. అన్ని తలంపులు ఏతలంపుకయితే వస్తున్నాయే ఆ మూలతలంపునుండి విడుదలపొందటమే మోక్షం. నేను అనే తలంపు ఎక్కడయితే లేదో అదే సహజస్థితి, అదే వాస్తవమైనస్థితి. మీకు జ్వరంవచ్చింది అనుకోండి. జ్వరాన్ని తగ్గించుకొంటే మీకు అదనంగా ఏమీరాదు, ఆజ్వరంరాకముందు మీరు ఎలాగ ఉన్నారో అదిపోయినతరువాతకూడా అలాగే ఉంటారు. నేనుఅనేదిఒకతలంపు. అదిపోతే మీరుపోతారు అనుకోవద్దు. అదిపోతే అది రాకముందు మీరు ఎలాగ ఉన్నారో అదిపోయిన తరువాత మీరు అలా అవుతారు. అదే సహజస్థితి.

నీవు చేసినపని అందరికీ తెలియాలి అనుకోవద్దు. అందరికీ తెలియాలిఅని అనుకొంటే దానివలన 5 పైసలు పుణ్యంవస్తే, 95 పైసలు అహంకారంవస్తుంది. ఆ పుణ్యం అనుభవిస్తే పోతుంది, వచ్చిన అహంకారము పోగొట్టుకోవటానికి వందజన్మలు పట్టవచ్చు అదీ గురువు దొరికితే. కొంతమంది రాజకీయనాయకులు అంటూఉంటారు మేము ప్రజలకోసం చాలా మంచిపనులు చేస్తున్నాము, చాలా కష్టపడుతున్నాము కాని అది ప్రజలకు చెప్పేవారు కనబడటంలేదు అంటారు. ఆ మాటలు వింటూఉంటే లోపల అజ్ఞానం ఎలా తాండవిస్తోందో అనిపిస్తుంది. భగవాన్ ఏమి చెపుతున్నారుఅంటే చెట్టుయొక్క ఆకులు గిల్లుతావుఅనుకో, కొమ్మలు నరికేస్తావుఅనుకో చెట్టుచావదు. వేరుపోతేగాని చెట్టు నశించదు. సంసారవృక్షానికి వేరు ఏమిటిఅంటే దేహమునేనుఅనేమూలతలంపు. సంసారంఅంటే ఇంట్లో మనుషులుకాదు, దేహమునేనుఅనేతలంపే సంసారం. దానిలోనుండివిడుదలపొందటానికి నీవు ఏప్రయత్నంచేసినా అదేభక్తి, అదేయోగం, అదేజ్ఞానం అన్నీఅదే. అక్కడకు తీసుకొనివచ్చి కొట్టికొట్టి విడిచిపెడతాడు. మనకు విసుగువస్తే మనం పోవలసిందేగాని ఆయన రాజీపడడు. ఆకులుగిల్లినా, కొమ్మలునరికినా, వేరుఅక్కడఉందిఅని మర్చిపోవద్దు. ఇవాళ చెట్టుఎండిపోయిందిఅని అదినిజంఅనుకోకు. లోపలవేరు ఉన్నంతసేపు ఆచెట్టు బ్రతికే అవకాశంఉంది. వర్షాకాలంవస్తే ఆకులువస్తాయి, కొమ్మలువస్తాయి, చెట్టుపచ్చబడుతుంది. అలాగే నీవు పైపై మెరుగులు చూసుకోవద్దు. మేము ఆశ్రమంలోఉన్నాము, బాగానేఉన్నాము అని మూలతలంపును అక్కడపెట్టుకొని కూర్చొంటే ఆమూలతలంపుఉంటే అన్నీ ఉన్నట్లే.





మంచిచెడు, స్వర్గంనరకం, సంతోషందుఃఖం అన్నీఉన్నట్లే. మీరు బాగానే చెపుతున్నారు అనటంకాదు. మీలో ఎంతవరకు మార్పువస్తోంది అదిచూసుకోండి. పార్వతిగారు బాగాచెపుతున్నారు, పద్మజగారు బాగా చెపుతున్నారు అదికాదు ఆ మాటలవలన మనలో ఎంతమార్పువస్తోందిఅనేది లోపలచూసుకో. నీవుచేసేసాధనవలన మూలతలంపు ఏమైనా కదులుతోందా? ఆ మూలతలంపునుండి విడుదలపొందటానికి పని ప్రారంభిస్తున్నావా? మూలతలంపునుండి విడుదలపొందటానికి నీవు ప్రయత్నంప్రారంభిస్తే ఈశ్వరుడు ఏమిచేస్తాడుఅంటే ముగింపు ఆయనచేస్తాడు. వీరు చాలాకష్టపడుతున్నారు, పని ప్రారంభించారు, మధ్యలోనికివచ్చారు, ఇంకముందుకు వెళ్ళలేకపోతున్నారుఅని అప్పుడు ఆయన కలుగజేసుకొని ముగింపు ఆయనచేసేస్తాడు. మీరు వూరికే చేతులుఆడించండి, డొక్కలు ఆడించండి సరిపోతుంది. పని మొదలుపెట్టండి, ఒక్క అడుగుఅయినా ముందుకువేయండి, ముగింపు ఆయన చేసుకొంటాడు. ఒకవేళ ఆయన ముగించడుఅనుకోండి. పని ప్రారంభించమని చెప్పావు, మేము ప్రారంభించాము ముగించేబాధ్యత నీకులేదా, ఇంకా ముగించవు ఏమిటిఅని ఆయనను పట్టుకొనితిట్టవచ్చు. మనుషులను తిడితే ప్రమాదంగాని దేవుడిని తిడితే ప్రమాదంలేదు. ఆయన ఏమీఅనుకోడు ఎందుచేతనంటే అక్కడ మనస్సులేదు. మిమ్మల్ని ఇక్కడకు రమ్మని చెప్పాము. ఏదోఒకటిచెప్పాలికదా. ఏమీచెప్పకుండా వెళ్ళిరమ్మంటే ఎలాగ? సాధన ప్రారంభించమని చెప్పావు, సాధన ప్రారంభించాము, ముందుకు తీసుకొని వెళ్ళకపోతే ఎలాగ? ఎందుకు తీసుకొని వెళ్ళటంలేదుఅని భగవంతుడిని డిమాండ్‌చేయవచ్చు. భగవాన్ నేనుఎవడనులో నేనును తొలగించుకోమనిచెప్పి, ఏకాత్మపంచకం దగ్గరకు వచ్చేసరికి అది లేనేలేదు ఇంక తొలగించుకోవటం ఏమిటి అన్నారు. అది ఉంది అనుకొంటున్నావుకాబట్టి పోగొట్టుకోమని చెపుతున్నారు. నీకు తత్వం తెలిసాక అది లేదుఅన్న సంగతి నీకు తెలుస్తుంది.

ఆత్మకు పుట్టటంలేదు, మరణించటంలేదు. చావుపుట్టుకలు అహంకారమునకు సంబంధించినవి. అవి నిజంకాదు. అవి నీభ్రమ. భ్రమలోనుండి విడుదలపొందితేగాని నీకు సత్యంతెలియదు. ఫలానాపేరునాది, ఫలానాదేహంనాదిఅనుకోవటం ఒకభ్రమ. అందులోనుండి విడుదలపొందితే ఏమీలేదు. ఇంతమంది జీవులు ఉన్నారా? ఒకడవౌ నిన్ను మాయమొనరించి వచ్చువారు ఎవరు ఇది నీ జాలము అరుణాచలా! అన్నారు భగవాన్. ఉన్నది ఒక్కటే అయితే వాడు మంచివాడు, వీడుచెడ్డవాడుఅని ఎందుకు అనిపిస్తోందిఅంటే వాసననుబట్టి మనకు అలాఅనిపిస్తోంది. మంచివాసనలువస్తూఉంటే మంచివాడు అంటున్నాము, చెడ్డవాసనలువస్తూఉంటే చెడ్డవాడుఅంటున్నాము. వాసనలోమంచి, చెడు

ఉన్నాయిగాని లోపల ఉన్న సద్వస్తువుకు మంచి, చెడ్డలేదు. అది ద్వైతానికి అతీతం. వాసనలు, గుణాలుఅన్నీ మనస్సులోఉన్నాయి. ఆగెడపదాటితే ఏమీలేదు. మౌనమే మౌనం, మహామౌనం.

రమణస్వామిఏమిచెపుతున్నారుఅంటే మనస్సు అణిగిఉంటే నీవు ఎక్కడఉన్నా సుఖంగా, శాంతిగా రోజులు వెళ్ళిపోతాయి. మానవజన్మవచ్చిందిఅని సంతోషించటంకాదు, సాధనచేసి మానవజన్మను సద్వినియోగంచేసుకో. సాధనచేయవుఅనుకో మానవజన్మ రావటంవలన పెద్దప్రయోజనం ఏమీలేదు. నీకు తెలియని సంస్కారములు నీలోపలచాలాఉంటాయి. ఈ జన్మలోనే నీకు మోక్షంఇవ్వాలిఅని పరమేశ్వరుడు అనుకొంటాడు అనుకో ఆ సంస్కారములు అన్నీ నీకు తెలియపరస్తూ ఉంటాడు. అప్పుడు ప్రయత్నంచేసి వాటిని తొలగించుకో. సంస్కారమునుండి తలంపువస్తుంది. తలంపునుబట్టి మాట్లాడతాము, తలంపునుబట్టిపనిచేస్తాము. పూర్వజన్మ సంస్కారము ఏది బలీయంగాఉంటే ఇప్పుడు దానిమీద మనకు ప్రీతికలుగుతుంది. దేనిని తెలుసుకొన్నాక ఎటువంటి దుఃఖంవచ్చినా నిన్ను కదపలేదో దానిని తెలుసుకోఅని పరమాత్మ చెపుతున్నాడు. జీవుడుమీదఉన్న ప్రేమచూడండి. మేము చాలాదుఃఖపడుతున్నాము, చావులన్నీ మాఇంటికే వస్తున్నాయి అనికొంతమంది అంటున్నారు. మాఇంటిలోనే అందరూ చనిపోతున్నారు మిగతావారిఇంటిలోకూడా కొంతమంది చనిపోవచ్చుకదా అంటున్నారు. మీ ఇంటిలో అందరూ చనిపోతారుఅనుకో, నావారుఅనుకొనేవారు అందరూ కాలిబూడిదఅవుతారు అనుకో ఎటువంటి దుఃఖంవచ్చినా రానియ్యి. ఏరకమైన దుఃఖంవచ్చినా నిన్ను కదపదో, నీకు కనీసం ఎర్రచీమకుట్టినట్లుకూడా ఉండదో అటువంటి సుఖానికి కళ్ళుతెరువు. ఎటువంటి జ్ఞానం పొందాక ఏరకమైన దుఃఖంనిన్నుఅంటదో, నీకు చాపల్యం తీసుకొనిరాదో అటువంటి జ్ఞానం సంపాదించు. కొంతమంది ధనం సంపాదించటానికి బ్రతుకుచున్నారు, కొంతమంది గౌరవంకోసం బ్రతుకుచున్నారు, కొంతమంది అధికారంకోసం బ్రతుకుచున్నారు. ఇదిఅంతా ఎందుకుచెపుతున్నానుఅంటే మనకు పూర్వజన్మలు ఉన్నాయి. ఆపూర్వజన్మ సంస్కారమునుబట్టి ఒకడికి చదువుమీద, ఒకడికిధనంమీద, ఒకడికి అధికారంమీద ప్రీతిఉంటుంది. ఏకొద్దిమందికో ఎక్కడోఒక్కడికో ఇద్దరికో ఆత్మజ్ఞానంమీద ఉంటుంది. అందులో తరించేవాడు ఒకడు ఉండవచ్చునేమో. సాధనచేసేవారు అందరూ తరిస్తారుఅని చెప్పలేము. ఆయన అనుగ్రహం ఎవరిమీదఉందో, ఆయన ఎవరికి తెలియబడాలిఅనుకొంటాడో వారికి తెలియబడతాడు. ఇక్కడ అర్థం చేసుకోవలసిందిఏమిటిఅంటే మీకు అనేక బాధలు, దుఃఖాలు ఉండవచ్చుకాని ఎటువంటి స్థితినిపొందాక నీకు ఏరకమైన దుఃఖంవచ్చినా నీకు





చాపల్యం కలుగదో అటువంటి జ్ఞానమును సంపాదించు, అటువంటి చైతన్యస్థితిని సంపాదించుఅని భగవంతుడు చెపుతున్నాడు.

సమానదృష్టిని విడిచిపెట్టవద్దు. సమత్వమే యోగం. మనస్సులో హెచ్చుతగ్గులు ఉన్నాయి, హెచ్చుతగ్గులు తొలగించుకొంటే ఆత్మాకారం పొందుతావు, చావులేనిస్థితికి ఎదిగివస్తావు. కోపం నిజంకాదు కోపంఒకవికారం, కోరిక ఒకవికారం, అసూయఒకవికారం. ఇవిఅన్నీ నిజంకాదు. ఇవిఅన్నీ అహంకారమునకు వచ్చేవే. ఈవికారములనుండి విడుదలపొందు. అందుకేసాధన. నిజమైన ఈశ్వరుడు నీహృదయంలోనేఉన్నాడు, అంతర్యామిగాఉన్నాడు. వాడు నీకుఏదో చెపుదాముఅనుకొంటున్నాడు. నీవు వాడికి అడ్డుపడుతున్నావు. వాడు తీరా బయటకువస్తే నీఅజ్ఞానం పోతుందేమోఅని నీ కంగారు. అహంకారంఏమిచేస్తుందిఅంటే లోపలఉన్నవాడిని నొక్కేయాలిఅనిచూస్తుంది. వీడు నన్ను నొక్కుతున్నాడు వీడి సంగతి చూడాలిఅని ఆయనఅనుకొని ఒక్కసారి విజృంభించి అహంకారాన్ని విసిరి అవతల పారేస్తేగాని వీడుపోడు. ఆరోజు ఎప్పుడువస్తుందో?

దేహంతో తాదాప్యంపొందే మొదటితలంపే బంధం, అదేఅవిద్య, అదేఅజ్ఞానం అన్నీఅదే. నీవు ఏప్రయత్నంచేసినా అందులోనుండి బయటకురావటానికి ప్రయత్నంచెయ్యి. అందులోనుండి బయటకురాకుండా నేను ఏదో పైపైమెరుగులుపెట్టానుఅంటే దానివలన ప్రయోజనంలేదు. ఆమూలతలంపే సర్వం. నీవుచేసేసాధనతాలుక దెబ్బలుఅన్నీ దాని నెత్తిమీద తగలాలి. అంతేగాని పుట్టమీద దెబ్బలుకొడితే లోపల ఉన్నపాముచావదు, దానివలన ప్రయోజనంలేదు. మేము ఏదోగౌరవంగా బ్రతుకుచున్నాముఅని చెపుతూఉంటారు. ఆపిచ్చిమాటలు ఎందుకు? ఈగౌరవంఎవరికి? అహంకారానికే. అహంకారం ఏమిచేస్తుందిఅంటే సాధనపేరుమీద మిమ్మల్ని పైపైన ఈదేటట్లుచేస్తుందిగాని లోపలదానిజోలికిరానివ్వదు. అసలు మీకు దుఃఖం ఎందుకువస్తోంది? మీరు ఉన్నస్థితి నిజమైతే మీకు దుఃఖం ఎందుకురావాలి. మీరు ఉన్నస్థితి నిజంకాదుకాబట్టి మీకు దుఃఖం వస్తోంది. నిజస్థితిలోనికివెళ్ళకుండా ఏది మీకుఅడ్డువస్తోంది? అడ్డువచ్చేదానిని తీసి ఒకప్రక్కనపెట్టు. అదేసాధన. మనం నడిచివెళుతున్నాముఅనుకోండి. దారిలోముళ్ళకంప అడ్డువచ్చింది. దానిని తిడుతూకూర్చోవటంఅనవసరం, దానినితీసి ఒకప్రక్కనపెట్టాలి. అలాగే నీసుఖానికి, శాంతికి ఏది అడ్డువస్తోందో చూసుకో. దానినితీసి ఒకప్రక్కనపెట్టు. దానితోగొడవపెట్టుకోవద్దు. మీరుఅందరూ బుద్ధుడుఅయిపోవాలి. బుద్ధుడుచుట్టాలు అవ్వటంకాదు. బుద్ధుడు ఎటువంటి సుఖాన్ని, శాంతినిపొందాడో అటువంటిసుఖం, శాంతి

మీకుకూడా అనుభవంలోనికి రావాలి. బుద్ధుడు ఒకమాటచెప్పాడు. మీకాలులోముల్లు విరిగిందిఅనుకో దానిని తీసివేయటానికి ప్రయత్నంచెయ్యి. అంతేగాని అది ఎక్కడవిరిగింది, ఎప్పుడు విరిగిందిఅని లెక్కలు నీకు అనవసరం. ఆ ముల్లును కాలులోనే ఉంచుకొని ఎక్కడవిరిగిందిఅనే గొడవఎందుకు? దానివలనప్రయోజనంలేదు. అలాగే మీలోఅజ్ఞానంఉందా, లేదా అనేదిచూసుకో. ఉంటే దానినితీసి ఒకప్రక్కనపెట్టు. అంతేగాని ఈ అజ్ఞానం ఎప్పుడువచ్చింది? ఎలావచ్చింది? అనిచూసుకోవటంవలన నీకు ప్రయోజనంఏమిటి?

రాగద్వేషములనుండి, కామక్రోధములనుండి విడుదలపొందు అని కృష్ణుడు చెపుతూఉంటాడు. కృష్ణుడు అటుచెపుతాడు, ఇటుచెపుతాడు. నీవు ఏదైతేపొందాలో చెపుతాడు, ఎందులోనుండి విడుదలపొందాలోచెపుతాడు. భగవాన్ ఏమిచెపుతున్నారుఅంటే అసలు వాటిగొడవ నీకుఎందుకు? పరమాత్మను పట్టుకో. వాడే విడుదలచేస్తాడు. ఎందులోనుండి విడుదల పొందాలో వాటిని తలపెట్టుకొంటావు ఎందుకు? నీవు కానిగొడవలునీకుఎందుకు? నీవు ఏదైతేకాదో దానిని ధ్యానంచేసినా నీవుఅదిఅవ్వవు. ఏదైతే నీవుఅవునో దానిని ధ్యానంచేస్తేకాని దానిలోనుండి విడుదలపొందుతావు. కృష్ణుడు అదీ, ఇదీ చెపుతాడు. కాని భగవాన్ నీవు ఏదైతేపొందాలో అదేఎక్కువచెపుతాడు, గమ్యంగురించే ఎక్కువచెపుతాడు. గమ్యంమీద ఆకర్షణపెంచుకో, గమ్యంమీద ప్రేమపెంచుకో. దానినే స్మరిస్తూఉండు, దానినేధ్యానిస్తూఉండు. నీవు దేనిలోనుండి విడుదలపొందాలో సహజంగానే అందులోనుండి విడుదలపొందుతావు. నీవుకాని దానినిగురించి ఆలోచించేబదులు, నీవు ఏదైతే అవునో దానినే ధ్యానంచెయ్యి. బేధంఅంతా మనస్సులోఉంది. సత్యంలోబేధంలేదు. ఎక్కడైతే బేధంలేదో దానినిధ్యానంచెయ్యి, బేధాలు ఉన్న మనస్సునుండి సహజంగానే విడుదలపొందుతావు. దేహంనేనుఅనేదిఒకవేషం. సాధనచేసి, సాధనచేసి ఆవేషంలోనుండి బయటకురా, నువ్వు ఎవడో నీకు తెలుస్తుంది. నువ్వు ఒకవేషంవేసుకొనివచ్చావు, నేనుఒకవేషంవేసుకొనివచ్చాను. నీ వేషంలోనుండి నీవుబయటకురా, నావేషంలోనుండి నేనుబయటకువస్తాను. అప్పడు నువ్వు, నేనులేము అన్నసంగతితెలుస్తుంది. వేషంలోనుండి బయటకురా అంతేగాని ఏదోసాధనచేస్తాముఅంటే కుదరదు ముందువేషంలోనుండి బయటకురా. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా ఈవేషంలోనుండి బయటకురావాలి. భగవదనుభవం పొందేవరకు మనం శూన్యంలోఉన్నట్లే. అప్పటివరకు మనం చీకటిలోఉంటాము, ఏదోరకమైన దుఃఖము మనలను వెంటాడుతూఉంటుంది.

05-01-2002



అందరిలోనూ ఈశ్వరుడు ఉన్నాడు. ఉంటేసరిపోతుందా? వాడిని చూడటంనేర్చుకో. వాడిని చూడటంనేర్చుకొన్నావుఅనుకో ఏదుఃఖం నిన్ను ముట్టుకొంటుంది? ఆయననుచూడటంచేతకాక ఆయనలేడుఅనుకొంటున్నాము. సాధనచేసి ఆయనను చూడటంనేర్చుకోవాలి. లోపలఉన్న ఈశ్వరుడిని చూడటంనేర్చుకొంటే మూలతలంపు పలాయనం చిత్తగిస్తుంది, నీకు చెప్పకుండానే పారిపోతుంది. అక్కడకు మనం ఎదగాలి. లోపలఉన్న జ్ఞానం విజృంభిస్తే అహంకారానికి ఉండటానికి అవకాశంలేదు. అహంకారం దానిని అది నశింపచేసుకోవటానికి ఇష్టంలేక ఎన్ని చేష్టలు చేయాలో అన్నీచేస్తుంది. చాలాపనులు చేయమని చెపుతుంది. పూజచేసుకోండి, నదులలోములగండి నాజోలికి రాకండిఅని చెపుతుంది. ఇదేమాయ. లోపలఉన్న మూలతలంపే మాయఅన్నసంగతి మనకు అర్ధంకావటంలేదు. ఎవరైనా ఏదైనా విషయాలు చెపుతూఉంటే ఇందులోఏమి ఉపయోగపడతాయిఅని మీరు ఆలోచించుకోవాలి. ఆలోచనకూడా అమృతంతో సమానము. మీరు ఏయోగం అవలంభించినా, మీగురువు ఎవరైనా సహస్రారం శుద్ధి అవ్వకుండా మీకు ఆత్మజ్ఞానంకలుగదు. ఈ సహస్రారాన్ని ఒకరకంగా అహంకారం శుద్ధిఅవ్వనివ్వదు. ఇది శుద్ధిఅయితేగాని అదిపోదు, అదిపోతేగాని ఇది శుద్ధిఅవ్వదు. భగవాన్ ఏమిచెప్పారుఅంటే అహంకారం గొడవవదిలెయ్యి. ఈశ్వరునిపాదాలనుఆశ్రయించు. ఆత్మను చింతించు. ఉపయోగంలేని చింతలకు చోటుఇవ్వవద్దు, నిరంతరం ఆత్మనుచింతించు. ఏదైనా పనిచేస్తే ఆత్మానుభవంపొందటానికి సహకరించే పనులుచెయ్యి. ఆత్మజ్ఞానం పొందటానికి సహకరించని తలంపులువస్తే వాటిని తీసి ఒకప్రక్కనపెట్టు. రమణాచార్యుడు చెప్పేది ఏమిటిఅంటే నీవుఏదైతే కాదో దానిని స్మరించటంకంటే నీవుఏదైతేఅవునో దానిని చింతించగా చింతించగా అది నీవుఅవుతావు. ధనం సంపాదించటంకంటే జ్ఞానం సంపాదించటంచాలాకష్టం. ధనసంపద ఈ దేహంఎంతనిజమో అదికూడా అంతేనిజం. జ్ఞానసంపద అలాకాదు మరుజన్మలోకూడా నిన్నువెంటాడుతుంది, జ్ఞానానుభవం కలిగేవరకు నిన్ను విడిచిపెట్టదు. ముగింపులో నేను చెప్పేమాట ఏమిటిఅంటే మీరు ఏస్థితిపొందాక మీకు ఎటువంటి దుఃఖంవచ్చినా, ఎటువంటి కష్టంవచ్చినా మిమ్మల్ని చీమతలకాయఅంతకూడా కదిలించలేదో అటువంటి ఆత్మసుఖాన్ని అటువంటి దైవస్థితిని, అటువంటి దివ్యస్థితిని పొందటానికి ప్రయత్నంచెయ్యి. ఆస్థితిని పొందినతరువాత సృష్టిలో ఏదీనీకు దుఃఖాన్ని తీసుకొనిరాలేదు.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | | |
|---|---|---|---|
| 06-01-02 | ఆది | వడ్డూరు | వయా తేతలి, తణుకు వద్ద |
| 11-01-02 | శుక్ర | కొమరగిరిపట్నం | ప్రహ్లాదస్వామి ఆశ్రమం, తూ॥గో॥జిల్లా |
| 19-01-02<br>20-01-02 | శని<br>ఆది | మురమళ్ల | వీరేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో |
| 21-01-02 | సోమ | మల్కిపురం | సాయిబాబా గుడివద్ద |

**సంసారమనేది నీ మనస్సులో ఉన్నదిగాని బయట లేదు. బయటి ప్రపంచం 'ఇదిగో నే నిక్కడ ఉన్నా' నంటూ ఘోషించదు. అది ఎప్పుడూ ఉండేదే అయితే, నీ గాఢనిద్రలో కూడ ఉండవలసిందే. అలా వుండదు గనుక అది అనిత్యం. ఆత్మ ఒక్కటే నిత్యం. మనస్సుతో, అనాత్మతో, తాదాత్మ్యం వదిలిపెట్టడమే నిక్కమైన సన్యాసం.**

- శ్రీ భగవాన్ రమణ మహర్షి

## భగవాన్ శ్రీ రమణ మహర్షి 122వ జయంతి మహోత్సవం



దిII 31-12-2001న భగవాన్ శ్రీ రమణ మహర్షి 122వ జయంతి మహోత్సవం శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరునందు అత్యంత వైభవముగా జరుపబడినది. ఈ జయంతి సందర్భంలో మన రమణ కుటుంబంలోని నెల్లూరు జిల్లా వాస్తవ్యురాలైన కుమారి ఎస్. కామాక్షికి ఆల్ ఇండియాలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటి పరిధిలో ఉన్న కాలేజిలన్నింటిలోకి నూటికి 98.8 శాతం మార్కులతో ప్రధమస్థానం వచ్చినందుకు సద్గురు శ్రీ నాన్నగారు ఘనంగా సన్మానించినారు. చిరంజీవి కామాక్షి మన రమణ కుటుంబానికి గర్వకారణం అని శ్రీ నాన్నగారు కొనియాడినారు.

రమణక్షేత్రం ప్రెసిడెంట్ శ్రీ పి.ఎస్.ఎన్. రాజుగారు సభా ప్రారంభంలో ప్రసంగించారు. మధ్యాహ్నం గం॥ 2-00లకు సద్గురు శ్రీ నాన్నగారు వారి అనుగ్రహ భాషణములు చేసారు. ఉదయం సెక్రటరీ శ్రీ పి. శ్రీరామరాజుగారు పూజా కార్యక్రమం నిర్వహించారు.